ట్రిపుల్ ఐటీలో 'ఏఐ ఆన్ ద ఎడ్జ్'పై సదస్సు

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ): అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల్లో ఒకటైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పరిశ్రమల్లోనే కాకుండా విద్యా సంస్థల్లో అవగాహన కల్పించేందుకు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రత్యేకంగా కృషి చేస్తోందని డైరెక్టర్ పీజే నారాయణన్ తెలిపారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలో 'ఏఐ ఆన్ ద ఎడ్జ్' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులపై ఎప్పటికప్పుడు పరిశోధనలు చేయడంతో పాటు వాటిని పరిశ్రమలు, విద్యా సంస్థలు భాగస్వామ్యాలు ఉండేలా ట్రిపుల్ ఐటీ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తాజాగా, ఐటీ రంగంలో ప్రముఖ సంస్థగా ఉన్న క్వాల్‌కామ్‌తో కలిసి 'ఏఐ ఆన్ ద ఎడ్జ్'ను నిర్వహిస్తోందన్నారు. అనంతరం, క్వాల్‌కామ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఇంజనీరింగ్) రాజేష్ నాయణన్ మాట్లాడుతూ, ఐటీ రంగ కొత్తగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీస్‌ను పరిశ్రమలు ఏవిధంగా ఉపయోగిస్తున్నాయో, అదే సమయంలో విద్యా సంస్థల్లో ఏ విధంగా ఉపయోగించాలో తెలుసుకునేలా చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఏఐ పరంగా కొన్నేళ్లుగా ఎన్నో పరిశోధనలు, మార్పులు వచ్చాయి. వాటిని పరిశ్రమల్లో వివిధ వినియోగిస్తుండగా, దాన్ని విద్యా సంస్థల్లో చదువుతున్న వారికి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు.

మారేడ్‌పల్లి ఇన్‌చార్జి ఎమ్మార్వోగా అశోక్

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ): మారేడుపల్లి మండల రెవెన్యూ కార్యాలయానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తిరుమలగిరి ఎమ్మార్వో అశోక్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పూర్తిస్థాయి ఎమ్మార్వోను కేటాయించే వరకు అశోక్ తహసీల్దార్‌గా విధులలో కొనసాగనున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంతో మారేడుపల్లి తహసీల్దార్ పద్మా సుందరిని కలెక్టర్ శుక్రవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

"నీట్‌ను రద్దు చేయండి.. భావి పౌరుల భవిత వ్యాన్ని కాపాడండి, ఎన్టీఏను వెంటనే రద్దు పర్చండి అంటూ నగరంలో శుక్రవారం సైతం పలు యూనివర్సిటీలలో విద్యార్థి సంఘాలు, పలు పార్టీల నేతలు పెద్ద పెట్టున నినదిస్తూ రాస్తారోకోలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా నీట్, నెట్ లాంటి పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ ఎన్టీఏ హెచ్ఆర్డీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని విద్యార్థి లోకంతో పాటు పలు పార్టీల నేతలు ఆందోళన బాట పట్టారు. ఇంత జరుగుతున్నా.. ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారని, ఇది సిగ్గుచేటని పలువురు నేతలు, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు."

నీట్‌పై ఉలుకూ.. పలుకేదీ..?

నీట్ పరీక్షను రద్దు చేయండి: ఏఐఎస్ఎఫ్ ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 21: దేశవ్యాప్తంగా వైద్య విద్యలో చేరేందుకు నిర్వహించిన నీట్ పరీక్షలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే దానిని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. యూజీసీ – నెట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో కలిసి సత్య మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్ కుమార్, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్‌లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నీట్ సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. తెలుగు విద్యార్థులకు న్యాయం చేయలేకపోతే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నీట్ సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. తెలుగు విద్యార్థులకు న్యాయం చేయలేకపోతే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని హితవు పలికారు. శనివారం కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, వీజేఎస్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్, యువజన కాంగ్రెస్, జన సమితి యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్టీఏ దిష్టిబొమ్మ దహనం

నీట్, నెట్ పరీక్షలు నిర్వహించడంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విఫలమైందని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్టీఏ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. దిష్టిబొమ్మతో ఓయూలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం, ప్రధాన రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ జాయింట్ సెక్రెటరీ పృథ్వితేజ మాట్లాడుతూ, దేశంలో ప్రతిష్టాత్మక పరీక్షలైన నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సీబీఐచే విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అసమర్థ ఎన్టీఏ సంస్థను ప్రక్షాళన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీహరి, రాజు, శ్రీధర్, ప్రశాంత్, వికాస్, సాయి, గణేశ్ సాగర్, దృహన్, హరిప్రసాద్, శివశంకర్, చైతన్య, విష్ణు, మనీశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాలి

నీట్ పరీక్షలో అక్రమాలతో దేశం మొత్తమ్మీద 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారిందని, తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్ డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలో చలనం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు శ్రీశైలం, ఓంకార్, రవి, మధు, ప్రవీణ్, మోహన్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించకపోవడం సిగ్గుచేటు

జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిని నేటికీ గుర్తించకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు తేళ్ల శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. నీట్‌లో అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష కుంభకోణానికి బాధ్యత వహిస్తూ ఎన్టీఏ డీజీ సుబోధ్ కుమార్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు.

హెచ్‌సీయూ గేటు ఎదుట విద్యార్థుల ఆందోళన

కొండాపూర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలను వేరుగా నిర్వహించాలంటూ శుక్రవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వర్సిటీ ప్రధాన ద్వారం ముందు నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలంటూ ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందని, ఓ వైపు నీట్ పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ నిమ్మకు నీరెత్తనంటూ వ్యవహరిస్తుందన్నారు. యూజీసీ నెట్‌ను రద్దు చేసి దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలను నిర్వహించేలా ప్రభుత్వం చూడాలంటూ డిమాండ్ చేశారు. ఆందోళన లో ఏఎస్ఏ, ఏఐఓబీసీఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ విద్యార్థి సంఘాల విద్యార్థులు పాల్గొన్నారు.

లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి

ఎల్బీనగర్: నీట్ పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. నాగరాజు మాట్లాడుతూ, నీట్ పరీక్షను రద్దు చేయాలని, లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని, సిట్టింగ్ జడ్జీతో ఈ కుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఏ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివ కుమార్, ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షుడు కానుగుల అరుణ్ పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై కాంగ్రెస్ ర్యాలీ

అబిడ్స్: నీట్ పరీక్ష అవకతవకలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. గాంధీభవన్ నుంచి నిర్వహించిన ర్యాలీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, మాజీ ఎంపీ మందడి అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, వెంకట్, నీలిమ పాల్గొన్నారు.

హైటెక్స్‌లో 28న ఇన్‌సైడర్ ఎక్స్‌పో

మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఐఐఐడీ డిజైన్ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్‌పో – 2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఐఐడీ, హెచ్‌ఆర్‌సీ పల్లవి అంచూరి విచ్చేసి ఐఐఐడీ, హెచ్‌ఆర్‌సీ కన్వీనర్ రాకేష్ వాసు, ఐఐఐడీ, హెచ్‌ఆర్‌సీ కో కన్వీనర్ నవీన్ చలసాని, ట్రేడ్ వైస్ చైర్మన్ సందీప్ జైన్‌తో కలిసి కార్యక్రమానికి చెందిన కర్టెన్ రైజర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హైటెక్స్‌లో జరగనున్న ఈ ప్రదర్శనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేయనున్నట్లు తెలిపారు.

– మాదాపూర్, జూన్ 21

హైటెక్స్‌లో ఆకట్టుకుంటున్న ఇండోమ్యాక్ ఎక్స్ పో

మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం దక్షిణ భారదేశంలో అతి పెద్ద పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఇండోమ్యాక్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోయికే కట్టింగ్, వెల్డింగ్ ఇండియా లిమిటెడ్ సీఈఓ కుమగయి విచ్చేసి నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనున్నదన్నారు. ఇందులో మహారాష్ట్ర, మధ్యప్రదేష్, ఛత్తీస్‌గడ్, ఒడిషాకు చెందిన కంపెనీ ఉత్పత్తులతో పాటు 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 750లకు పైగా లైవ్ మెషనరీలు, 900లకు పైగా ప్రసిద్ధ, జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లను ప్రదర్శించారు.

– మాదాపూర్, జూన్ 21

భాజగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం

కొమిరిశెట్టి సాయిబాబా

శేరిలింగంపల్లి, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ సేవలు ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకమైనవని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గచ్చిబౌలి డివిజన్ భాజగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన మహానీయుడని ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. బీఆర్ఎస్ నాయకులు సతీష్ ముదిరాజ్, నారాయణ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు శ్రద్ధాంజలి

జయ శంకర్ సార్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ తదితరులు

సుల్తాన్ బజార్, జూన్ 21: 1952లో 'నాన్ ముల్కీ గో బ్యాక్, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక హోదా కోసం ఉద్యమాలను ప్రారంభించిన ఘనత ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయ శంకర్ సార్‌కే దక్కుతుందని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయ శంకర్ సార్ 13వ వర్ధంతి సందర్భంగా ఆయన సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. టీఎన్జీవో జిల్లా శాఖ కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు కేఆర్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, శ్రీధర్ నాయుడు, గీత, సుజాత, పీఆర్వో మహమ్మద్ వహీద్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

నిరుద్యోగ జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ నేత మోతీలాల్ నాయక్

నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడుతున్న మోతీలాల్ నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 21: రాష్ట్రంలోని నిరుద్యోగుల డిమాండ్లను తక్షణమే 48 గంటల్లో పరిష్కరించి న్యాయం చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. నిరుద్యోగుల సమస్యలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం, మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించలేదని మండిపడ్డారు. గ్రూప్-1 మెయిన్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-2 పోస్టుల సంఖ్యను రెండు వేలకు, గ్రూప్-3 పోస్టుల సంఖ్యను మూడు వేలకు పెంచాలన్నారు. గురుకుల పోస్టుల రీలింక్విష్‌మెంట్ చేయాలని, మెగా డీఎస్సీని ప్రకటించి, పోస్టుల సంఖ్యను పెంచాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చింది విద్యార్థి, నిరుద్యోగులేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. నిరుద్యోగులను మోసం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు.

గత ప్రభుత్వంలోనే నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నీటి సమస్యలు రాకుండా చూడాలి: మాజీ మంత్రి పి.సబితారెడ్డి

క్యాంప్ కార్యాలయంలో హెచ్ ఎండబ్ల్యూఎస్ అధికారుల సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 21: నీటి ఎద్దడి నివారణకు గత ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పక్కదృష్టి చర్యలు చేపట్టినట్టు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నీటి ఎద్దడి సమస్యను నివారించడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలని సబితా ఇంద్రారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హెచ్‌ఎండబ్ల్యూస్ అధికారులతో నీటి సమస్య, రిజర్వాయర్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు 06, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు 08, జల్‌పల్లి మున్సిపాలిటీకి 5, తుక్కుగూడ మున్సిపాలిటీకి 3 రిజర్వాయర్లు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. నీటి ఎద్దడి నివారించేందుకు గత ప్రభుత్వం 107 కోట్ల నిధులు కేటాయించి రిజర్వాయర్ల పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంకా కొన్ని రిజర్వాయర్లు కావాలని గతంలో ముఖ్య మంత్రిగా ఉన్న కేసీఆర్‌ను కోరడంతో రూ.207 కోట్లతో కొత్తగా మరో 13 రిజర్వాయర్లు మంజూరు చేయడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. చాలా వరకు పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా రిజర్వాయర్ల పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఆగిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే రిజర్వాయర్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గతంలో వేసిన పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు వేయించాలన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్ గూడలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎంలో దాదాపుగా నాలుగు వేల కుంటుంబాలు ఉన్నాయన్నారు. అక్కడ ప్రస్తుతం నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. నీటి సమస్య ను పరిష్కరించడానికి రిజర్వాయర్లను పూర్తి చేస్తే కుర్మల్‌గూడలో నీటి సమస్య తీరుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఘోరమైన నీటి సమస్య ఉండేదన్నారు. నీటి కోసం బారులు తీరేవారన్నారు. బిందెలతో ముష్టి యుద్ధాలు చేయాల్సి వచ్చేదన్నారు. ఇదంతా గమనించిన కేసీఆర్ ప్రజల నీటి సమస్యను పరిష్కరించాలన్న ఆలోచనతో మిషన్ భగీరథ ద్వారా మంచి నీటి సరఫరా చేయాలన్న సంకల్పించి ప్రణాళికాబద్ధంగా పనులు చేయించారన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎక్కడ చూసినా నీటి సమస్య పునరావృతం అయ్యిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎక్కడ కూడా నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, జీఎం శ్రీనివాస్ రెడ్డి, గోవింద్ గూడ్, హరీష్ కుమార్, కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, సూర్ణ గంటి అర్జున్, బోయపల్లి శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, అర్కల కామేష్ రెడ్డి ఉన్నారు.

యోగా విశ్వవ్యాప్తమైంది

స్వామి రామ్‌దేవ్ బాబా

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ): యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావడమే కాకుండా విశ్వవ్యాప్తమైందని, తద్వారా ఎంతో ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడపచ్చని పతంజలి యోగా పీఠ్ వ్యవస్థాపకులు స్వామి రామ్‌దేవ్ అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పతంజలి యోగాపీఠ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి రామ్‌దేవ్ మాట్లాడుతూ, పతంజలి ద్వారా మానవాళి సంక్షేమం కోసం శాస్త్రీయ పద్ధతిలో యోగా, ప్రాణాయామాన్ని ప్రచారం చేస్తుంటామని, ప్రతి యేటా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంతో ప్రత్యేకమైందన్నారు. యోగా ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు తమ రోజు వారి దిన చర్యను ప్రారంభిస్తున్నారని, యోగా చేయడం ద్వారా మంచి ఆరోగ్యవంతులుగా నివసిస్తున్నారన్నారు. ప్రస్తుత జీవన శైలిలో ఎన్నో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా రోగాలు ఎక్కువ వస్తున్న నేపథ్యంలో యోగా చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందడమే కాకుండా ఆరోగ్యవంతులు ఉండేందుకు మంచి ఔషధంగా యోగా మారిందన్నారు. యోగాను ఒక్క రోజు మాత్రమే చేయడం కాదు, ఏడాదిలో 365 రోజులు చేయాలని ఆయన సూచించారు. పతంజలి యోగాపీఠ్‌లో జరిగిన కార్యక్రమంలో సుమారు 200 గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

ఏజెన్సీలో 100% ఉద్యోగ కల్పనకు చర్యలు

సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్

విస్తృత స్థాయి సమావేశంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్

చిక్కడపల్లి, జూన్ 21: సుప్రీం కోర్టు జీవో నం.3కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం మరో జీవో తీసుకొచ్చి ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ కల్పనకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన రాష్ట్ర స్థాయి విస్తృతస్థాయి స్థాయి సమావేశం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీవో నం. 33 ద్వారా గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అడ్డుకోవాలని కొంత మంది కోర్టులో కేసు వేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలారాసే విధంగా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తండా పంచాయితీ పరిధిలోని అన్ని శాఖల్లోని ఉద్యోగాలను గిరిజనులచే భర్తీ చేయాలని, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాకి డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్ సైదా నాయక్, కో కన్వీనర్ హుస్సేన్ నాయక్, కిషన్ నాయక్, భాస్కర్ నాయక్, ధర్మా జాగరన్ సేన అధ్యక్షుడు రమేశ్ మహరాజ్, గ్రేటర్ అధ్యక్షుడు కల్యాన్ నాయక్, అజ్మీర్ వెంకన్న, శ్రీనివాస్ నాయక్, సుమ్మీబాయి పాల్గొన్నారు.

శరత్ సిటీ మాల్‌లో అరిరంగ్ కొరియన్ ఫెయిర్

కొండాపూర్, జూన్ 21: సాంస్కృతిక మార్పిడి, అవగాహన పెంపొందించడంలో కొరియన్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని కొరియా రిపబ్లిక్ గౌరవ జనరల్ సురేష్ చుక్కపల్లి అన్నారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా గౌరవ కాన్సులేట్ జనరల్, ఢిల్లీలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబార కార్యాలయంతో కలిసి శుక్రవారం కొండాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో కొరియన్ ఫెయిర్ 'అరిరంగ్'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొరియా రాయభారి చాంగ్ జే బోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొరియన్ సంస్కృతి, సంప్రదాయాల మార్పిడితో పాటు ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే కొరియన్ ఫెయిర్‌లో కొరియన్ బ్యూటీ, పర్సనల్ కేర్, హెల్త్, వెల్‌నెస్, సాంస్కృతిక ప్రదర్శనలు, తైక్వాండో, సంగీతం, సంప్రదాయ దుస్తులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

ఎస్‌బీఐలో యోగా వేడుక

ఎస్‌బీఐ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ఆధ్వ